● ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామి వారికి మంగళవారం అభిషేకాలు, తమలపాకులతో అర్చన జరిగింది. ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద, దేవస్థాన ఘాట్ రోడ్డులోని స్వామి వారి ఆలయం, పాత మెట్ల మార్గంలోని ఆంజనేయునికి పూజలు నిర్వహించారు.

అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్ సీపీ లక్ష్యం

వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని



బాడవపేటలో ఎంపీ కేశినేని శ్రీనివాస్తో కలిసి ప్రచారంలో పాల్గొన్న దేవినేని అవినాష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చేయడంతో పాటు, రాజకీయాలకు తావులేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్ సీపీ లక్ష్యమని ఆ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని), తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. వీరిద్దరూ మంగళవారం 7వ డివిజన్లోని బాడవపేట, నెహ్రూ నగర్, ఉడ్పేటల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరికీ మేలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని కోరారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలన్నారు. రాష్ట్రంలో నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే, ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేశారన్నారు. విజయవాడ నగరం ఎన్నడూ లేనంతగా అభివృద్ధి చెందిందన్నారు. అబద్ధాలు, అసత్య ప్రచారం, గ్రాఫిక్స్ను నమ్మవద్దన్నారు. మంచి చేసే వారిని గెలిపిస్తే, మళ్లీ ఐదేళ్ల సంక్షేమ పథకాలు నిర్విరామంగా కొనసాగడంతో పాటు, మన ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెరకనపల్లి మాధురి, పార్టీ నేతలు ఇందుపల్లి సుభాషిణి, బుర్రి జగ్జీవన్రావు, సంపత్, కొండా, అశోక్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఆ ప్రాంతంలో నిర్వహించిన ప్రచారానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ప్రతి మహిళ తనకు పథకాలు అందాయని, వైఎస్ జగన్ను మళ్లీ అధికారంలోకి తీసుకువస్తామని పేర్కొనడం విశేషం.

వైఎస్సార్ సీపీని ఆదరించండి



20వ డివిజన్లో ఎన్నికల ప్రచారం చేస్తున్న క్రాంతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ సోదరి దేవినేని క్రాంతి అన్నారు. కృష్ణలంక, 20వ డివిజన్లో పోస్టాఫీస్ రోడ్డు, నవభారత్ రోడ్డులో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా క్రాంతి మాట్లాడుతూ రాష్ట్రంలో పారదర్శకంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్న ఘనత సీఎం జగన్మోహన్రెడ్డికే దక్కుతుందన్నారు. భవిష్యత్లోనూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే తిరిగి జగన్మోహన్రెడ్డినే ముఖ్యమంత్రి చేసుకుందామన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా దేవినేని అవినాష్ని, ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని)ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పల్లెం రవి, 20, 21, 22 డివిజన్ల వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మీర్ హుస్సేన్, వైఎస్సార్ సీపీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మంచి చేసే వారిని గెలిపించండి

లబ్బీపేటలో దేవినేని సుధీర, కేశినేని హైమా విస్తృతప్రచారం



లబ్బీపేటలో ప్రచారం నిర్వహిస్తున్న దేవినేని సుధీర, కేశినేని హైమా

లబ్బీపేట(విజయవాడతూర్పు): నాలుగున్నరేళ్లుగా నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తూ మంచి చేసిన వారిని రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని దేవినేని అవినాష్ సతీమణి సుధీర, కేశినేని శ్రీనివాస్ కుమార్తె కేశినేని హైమాలు కోరారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్, పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం లబ్బీపేట పైడియ్య వీధి, టెంపుల్ స్ట్రీట్లలో వారు ప్రచారం నిర్వహించారు. సుధీర మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఏ సమస్య వచ్చినా అండగా ఉండే వారిని మంచి మనస్సులో ఆదరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి, వైఎస్సార్సీపీ అభ్యర్థులకు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 19వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ రెహానా నాహీద్, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అలీం, మునీర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మునీర్ అహ్మద్ షేక్, పార్టీ జిల్లా కార్యదర్శి చింతగుంట విజయ్కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు బుర్రి జగ్జీవన్రావు, ఎస్కే వలీతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

9వ డివిజన్ ప్రచారంలో తూర్పు వైఎస్సార్ సీపీ అభ్యర్థి దేవినేని అవినాష్



పటమటలంకలో ప్రచారం నిర్వహిస్తున్న దేవినేని అవినాష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): నాలుగున్నరేళ్లలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, మంచి పనులను చూసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మంగళవారం 9వ డివిజన్ పటమటలంక ప్రాంతంలో పర్యటించారు. ఆ ప్రాంత నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి నాయకత్వంలో తూర్పులో రూ.650 కోట్లు అభివృద్ధి పనులు చేశామన్నారు. మంచి చేయడంతోనే నేడు ఏ ప్రాంతానికి వెళ్లిన ప్రజలు ముందుకు వచ్చి తమకు మద్దతు తెలియజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. నాలుగున్నరేళ్లలో ఈ ప్రాంతంలో రోడ్లు, చేపల మార్కెట్ అభివృద్ధి, డ్రైనేజీ నిర్మాణం వంటి అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు.

గతంలో కాల్మనీకి అడ్డా..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని గద్దె రామ్మోహన్ తూర్పు నియోజకవర్గాన్ని కాల్మనీ సెక్స్ రాకెట్కు అడ్డాగా మార్చారని విమర్శించారు. బెట్టింగ్లతో కాలం గడిపారన్నారు. ఏనాడు కూడా నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. మంచి పనులు చేసిన తమను ప్రజలందరూ ఆశీర్వదించి వైఎస్సార్ సీపీ గెలిపించాలని కోరారు. ప్రచారంలో ఆ డివిజన్ ఇన్చార్జి వల్లూరు ఈశ్వరప్రసాద్, గద్దే కల్యాణ్రామ్, ఇతర పార్టీ నేతలు పాల్గొన్నారు.

నిబంధనల ఉల్లంఘనలపై జరిమానా

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ సర్కిల్ 3 కార్యాలయంలో మంగళవారం జరిగిన మొబైల్ కోర్టులో 33 కేసులు విచారణ జరిగాయి. రోడ్ల పైన చెత్త వేసిన వారికి, కార్పొరేషన్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి ప్రతి మంగళవారం జరిగే మొబైల్ కోర్టులో భాగంగా కార్పొరేషన్ కోర్టు న్యాయమూర్తి బి.విజయ్ కుమార్ రెడ్డి జరిమానా విధించారు. రోడ్డుపై చెత్త వేసిన, లైసెన్సు లేకుండా వ్యాపారం చేస్తున్న, మురుగు ప్రవాహానికి అడ్డుపెట్టినందుకు సర్కిల్-3 పరిధిలోని శానిటరీ ఇన్స్పెక్టర్లు నమోదు చేసిన 33 కేసులను ఆయన విచారించి వారికి రూ.19,350 జరిమానా విధించారు. ఈ సందర్భంగా విజయ్కుమార్రెడ్డి మాట్లాడుతూ ఒకసారి జరిమానా విధించాక రెండోసారి కూడా ఆ తప్పు చేస్తే కఠినంగా చర్యలు తీసుకొని లైసెన్స్ కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదానానికి పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురానికి చెందిన భక్తులు మంగళవారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. నరసాపురానికి చెందిన గొట్టుముక్కల శ్రీసాయి ఫణీంద్ర వర్మ, మీనా భారతి కుటుంబం సమేతంగా అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. 1,00,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఏఈవో ఎన్. రమేష్బాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

శరత్ చంద్ర విద్యార్థులకు సివిల్స్లో ర్యాంకులు



5వ ర్యాంకర్ రుహానీతో ఎండీ శరత్చంద్ర

లబ్బీపేట(విజయవాడ తూర్పు): సివిల్స్ ఫలితాల్లో విజయవాడ, హైదరాబాద్లోని శరత్చంద్ర ఐఏఎస్ అకాడమీల్లో శిక్షణ పొందిన వారు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు అకాడమీ ఎండీ తోట శరత్చంద్ర తెలిపారు. తమ వద్ద శిక్షణ పొందిన అనన్యరెడ్డి 3వ ర్యాంకు, రుహాని 5వ ర్యాంకు సాధించగా, ఇంకా 16, 19, 42, 61, 91 ఇలా 50వరకు ర్యాంకులు తమ విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. వారిలో 19 ర్యాంకులు తెలుగు విద్యార్థులకు వచ్చాయన్నారు. ఇతర ర్యాంకులు తమ ఆన్లైన్ క్లాసెస్, ఢిల్లీ బ్రాంచ్, టెస్ట్ సిరీస్, ఇంటర్వ్యూ గైడెన్స్ నుంచి వచ్చినట్లు తెలిపారు. తెలుగు మీడియం చదివి, కానిస్టేబుల్గా ఉద్యోగం చేస్తూ సింగరాయకొండకు చెందిన ఉదయ్రెడ్డికి 780వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన వారికి, మహిళలకు అత్యధికంగా ర్యాంకులు రావడం సంతోషకరమన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్రెడ్డికి వివరించారు. రాష్ట్ర సచివాలయం నుంచి వేసవిలో తాగునీటి సరఫరా, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్రెడ్డి సమీక్షించారు. నగరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నీటితో నింపుతున్నామన్నారు. వేసవిలో ఎటువంటి తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు.

22 నుంచి ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 22వ తేదీ నుంచి నెల రోజుల పాటు ప్రతి రోజు ఉదయం 8 నుంచి 9.30గంటల వరకు స్పోకెన్ ఇంగ్లిష్ క్లాసులు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు ఎంబీ విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ యూవీ రామరాజు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్పోకెన్ ఇంగ్లిష్ బోధనలో 20 ఏళ్ల అనుభవంతో పాటు అనేక కార్పొరేట్ కంపెనీలలో సెమినార్లు నిర్వహించిన పాగోలు రాజు క్లాసులు తీసుకుంటారని తెలిపారు. ఈ క్లాసులు రాఘవయ్య పార్కు సమీపంలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో జరుగుతాయన్నారు. ఆసక్తిగల వారు ఈ నెల 21వ తేదీలోగా తమ కార్యాలయంలో గాని, 0866 2578044, 94900 98408 నంబర్లలో గాని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు, ఇంటర్, డిగ్రీ విద్యార్థులు ఉద్యోగులు, గృహిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.